సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం | 4 | ఆగస్టు | 2024




సహకారంలో స్వాహాపర్వం


- బినామీ రైతుల పేరిట పంట రుణాలు
- చనిపోయిన వారు పేర్లు సైతం జాబితాలో..
- రుణమాఫీతో బయటపడుతున్న అక్రమాలు
- రూ.అరకోటికి పైగానే పక్కదారి



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు బొప్ప వెంకన్న. చందుర్తి మండలంలోని మూడపల్లి. ఇతను చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట రుణం తీసుకున్నాడు. తన రుణమాఫీ గురించి తెలుసుకునేందుకు చందుర్తి కేడీసీసీ బ్యాంక్‌కు వెళ్లాడు. బొప్ప ఇంటి పేరుపై ఉన్న రుణగ్రహీతల పేర్లను సిబ్బంది చదివి వినిపించారు. అందులో తన తండ్రి బొప్ప నారాయణ పేరిట రూ.లక్ష పంట రుణం ఉందని చెప్పడంతో అవాక్కయ్యాడు. తన తండ్రి నారాయణ 2017 ఫిబ్రవరి 20వ తేదీన మరణించాడని, అతని పేరిట పంట రుణం ఎట్లా ఉంటుందని బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నించాడు. ఈ విషయం సొసైటీ సీఈవోను అడిగితే ఆ రూ.లక్ష చెల్లించినట్లు రశీదును అప్పగిస్తున్నట్లు తెలపడంతో వెనుదిరిగాడు.



సొసైటీ పరిధిలో అప్పు తీసుకున్న రైతుపత్రం



రైతు డమ్మీ ఫొటోతో రుణ మంజూరుపత్రం

చందుర్తి(వేములవాడ): రైతులకు పంటరుణాలు ఇవ్వడం, విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన సహకార సంఘాలు అక్రమాలకు నిలయంగా మారుతున్నాయి. సొసైటీ సిబ్బంది ధనార్జనే ధ్యేయంగా ఫేక్ సర్టిఫికెట్లతో లక్షల కొద్ది రూపాయలు స్వాహా చేస్తున్నట్లు తెలిసింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలోనూ పాలకవర్గ సభ్యులు చేసిన ఆరోపణలు నేడు నిజమవుతున్నాయనే చర్చ సాగుతోంది. స్థానిక సొసైటీలో పనిచేసే సిబ్బంది చేతివాటంతో చెడ్డపేరు వస్తుంది.

బినామీల పేరుతో రుణాలు

- సొసైటీ సిబ్బంది బినామీ రైతుల పేరిట బ్యాంకులో తప్పుడు ఆధార్‌కార్డులతో లక్షలాది రూపాయలను అప్పు రూపంలో తీసుకుని మెక్కేస్తున్నారు.
- చందుర్తి మండల కేంద్రానికి చెందిన మెంగని రాజయ్య తండ్రి వెంకటి చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.2లక్షల అప్పు తీసుకున్నాడు.
- మెంగని రామయ్య తండ్రి లస్మయ్య పేరిట బినామీ పత్రాలతో రూ.2లక్షలు పంట రుణం తీసుకున్నట్లు ఉంది. అయితే మెంగని రామయ్య అనే పేరు గల వ్యక్తి చందుర్తిలో లేడని గ్రామస్తులు తెలిపారు.
- రామన్నపేటకు చెందిన పోతురాజు బుచ్చిరాములు రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. ఇతని పేరు రుణమాఫీ జాబితాలో రాకపోవడంతో వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లి అడిగాడు. ఆన్‌లైన్‌లో పరిశీలించిన వ్యవసాయాధికారులు బుచ్చిరాములు భార్య గంగు పేరిట మరో రూ.లక్షతో కలిసి వారి కుటుంబం పేరిట మొత్తం రూ.2లక్షలు రుణం ఉన్నట్లు తెలిపారు. అయితే తన భార్య గంగు పేరిట వ్యవసాయ భూమి లేదని అతను తెలిపాడు. దీంతో అప్రమత్తమైన బుచ్చిరాములు వెంటనే చందుర్తి సొసైటీ సీఈవోను నిలదీయగా.. ఆ డబ్బులు చెల్లిస్తానని తెలిపినట్లు బుచ్చిరాములు తెలిపాడు.
- చందుర్తి మండలం మూడపల్లికి చెందిన గోలి లక్ష్మి పేరిట భూమి లేకున్నా సొసైటీలో పంట రుణం రూ.లక్ష ఉందని వ్యవసాయాధికారులు తెలపడంతో వారు అవాక్కయ్యారు.
- చందుర్తి మండల కేంద్రానికి చెందిన బొల్లు నర్సయ్య అనే రైతుకు 2018 సంవత్సరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.90వేలు మాఫీ వచ్చింది. తిరిగి క్రాప్ లోన్ తీసుకోలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పథకంలో పేరు రావడంతో అప్పు తీసుకోకుండా పేరు ఎలా వచ్చిందని సొసైటీ సిబ్బందిని ప్రశ్నిస్తే ఆ డబ్బులు తామే చెల్లిస్తామని సిబ్బంది చెప్పడంతో శాంతించాడు.
- చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన జగిత్యాల రాజు అనే రైతు సొసైటీలో రూ.90వేలు అప్పు తీసుకున్నాడు. కాగా అతని పేరిట రూ1.60 లక్షలు రుణం తీసుకున్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తుంది. ఈ విషయమై సొసైటీ సిబ్బందిని నిలదీస్తే మిగతా సొమ్మును తాము చెల్లిస్తామని బదులిచ్చినట్లు తెలిపారు.
- ఇలా దాదాపు 50 మంది బినామీ రైతుల పేర్లతో పంట రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది. బినామీ రైతుల పేరిట సొసైటీలో సుమారు రూ.అరకోటికి పైగానే పక్కదారి పట్టించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పదేళ్ల క్రితం తీసుకున్నవే..

సొసైటీ పరిధిలో తప్పుడు పత్రాలతో అప్పులు తీసుకున్న రైతులు పదేళ్ల క్రితం వారే. అప్పటి నుంచి రెన్యూవల్ చేసుకుంటూ వస్తున్నారు. తప్పుడు పత్రాలతో పంట రుణానికి ఏ ఫైల్‌పై సంతకాలు పెట్టలేదు. నేనంటే గిట్టని వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

– శ్రీనివాస్, సింగిల్‌విండో అధ్యక్షుడు, చందుర్తి

తప్పుడు ఆరోపణలు

సొసైటీలో పంటరుణాలు తీసుకున్న రైతుల ఆధార్‌కార్డు నంబర్లు తప్పుగా పడ్డాయి. ఒకరి నంబర్లు ఒకరికి పడ్డాయి. పొరపాట్లను సరి చేసుకుంటున్నాం. రుణమాఫీలో అర్హులైన రైతులకు అన్యాయం జరగకుండా చూస్తాం. పంట రుణాలు తీసుకున్న రైతులను మరోసారి పరిశీలిస్తున్నాం.

– ఎగుమామిడి గంగారెడ్డి, సీఈవో, చందుర్తి సింగిల్ విండో సొసైటీ

ఎవరూ అడగరనే ధీమా

సొసైటీ పరిధిలో పంటరుణాలు ఇచ్చే ఫైళ్లపై సొసైటీ సీఈవోతోపాటు చైర్మన్ సంతకాలు పెట్టాల్సి ఉంటుంది. ఇలా బినామీ రైతుల పేరిట రుణాలు తీసుకోవడం వెనుక వీరిద్దరి ప్రమేయం లేకుండా జరుగదనే చర్చ సాగుతోంది. వీరి ఆగడాలను ఎవరూ అడగరనే ధీమాతోనే స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం పంట రుణమాఫీ డబ్బులను రైతుల వ్యక్తిగత ఖాతాల్లో కాకుండా సొసైటీ ఖాతాలో జమ చేస్తుండడంతో తమకు తప్పా ఇతరులకు తెలియదన్న ధీమాతోనే ఇలా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

న్యూస్‌రీల్

డెంగీ పాజిటివ్ వస్తే సమాచారం ఇవ్వండి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజ్‌గోపాల్



ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న అధికారులు

సిరిసిల్ల: జిల్లాలో డెంగీ, మలేరియా పాజిటివ్ కేసులు వస్తే వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో బి.రాజ్‌గోపాల్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాధారణ, సీ–సెక్షన్ ప్రసవాలు, అబార్షన్ల సంఖ్యను పరిశీలించారు. అనవసరంగా ప్రసూతి ఆపరేషన్లు చేయొద్దని డాక్టర్ రాజ్‌గోపాల్ కోరారు. ఆస్పత్రుల ల్యాబ్ రిజిస్టర్‌లు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సీహెచ్‌వో బాలచంద్రం, హెచ్‌ఈ బాలయ్య, ఎంపీహెచ్‌ఏ మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దు

- నార్కోటిక్స్ సీఐ కృష్ణమూర్తి



పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మత్తు పదార్థాలు వినియోగించి విలువైన జీవితాలను చిత్తు చేసుకోవద్దని నార్కోటిక్స్ సీఐ కృష్ణమూర్తి కోరారు. ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్సీ గురుకుల బాలుర పాఠశాలలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై శనివారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయితో జీవితంలో ఏది సాధించలేరన్నారు. కష్టపడి చదివి భవిష్యత్‌ను బాగు చేసుకోవాలని సూచించారు. ఎస్సై గణేశ్, ప్రిన్సిపాల్స్ ఉదయ్‌కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

స్నేహబంధం శాశ్వతం

- చివరి వరకూ మిగిలేదే చెలిమి
- స్వచ్ఛతే స్నేహానికి గీటురాయి
- చర్చాగోష్టిలో విద్యార్థినులు

సిరిసిల్లకల్చరల్: స్నేహం.. కల్లకపటం తెలియని వయసులో మొదలైనా.. కాలేజీ వయసులో మొదలైనా.. స్నేహితుడికి ఆపద వస్తే ముందుండేది. ఎందరు ఉన్నా ఏ సమస్య వచ్చిన చెప్పుకునేందుకు ఓ స్నేహితుడు ఉంటే చాలు అన్ని మరిచిపోతాం. అంత గొప్పది స్నేహం. ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో చర్చావేదిక నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ ఎప్పటికీ స్నేహబంధమే శాశ్వతమన్నారు. స్నేహితులతో ఉంటే ఏదైనా సాధించగలమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పలువురు విద్యార్థినులు వెలిబుచ్చిన అభిప్రాయాలు వారి మాటల్లోనే...

స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాక్షి చర్చావేదిక



వ్యక్తిత్వం మెరుగుపరిచేలా ఉండాలి



స్నేహం ఒకరి ఎదుగుదలకు మరొకరు కృషిచేసేలా ఉండాలి. మనుషులుగా వేరు ఉన్నప్పటికీ ఆలోచన విధానాలు ఒకేలా ఉండే వ్యక్తుల మధ్య స్నేహం చిరకాలం ఉంటుంది.

– బొమ్మ త్రిష, బీఎస్సీ ఫైనలియర్

అరమరికలు ఉండొద్దు



స్నేహితుల మధ్య అరమరికలు ఉండకూడదు. కొన్ని సార్లు గోప్యత అవసరమే. స్నేహితుల్లో ఒకర పొరపాట్లు చేస్తుంటే తెలిసి కూడా హెచ్చరించకపోతే వారికే నష్టం. తప్పులు జరిగినప్పుడు హెచ్చరించే వాళ్లే నిజమైన మిత్రులు.

– నరుకుల ప్రదీప్తిక, బీకామ్ ఫైనలియర్

మన కోసం ఆలచించే వారు బెటర్



స్వచ్ఛమైన స్నేహం ఎదుటి వాళ్లు బాగుండాలని ఆరాటపడుతుంది. అభివృద్ధి చెందితే సంతోషిస్తుంది. కష్టంలో తోడు ఉండడం, ఆనందాల్లో హుందాగా ఉండడం వంటి ఉన్నతమైన లక్షణాలు ఉన్న వాళ్లను స్నేహితులుగా ఎంచుకోవాలి.

– గుగులోతు సంగీత, బీకామ్ ఫస్టియర్

అభివృద్ధిని కోరుకునే వాళ్లే స్నేహితులు



అభివృద్ధిని కోరుకునే వాళ్లే నిజమైన స్నేహితులు. ప్రోగ్రెసివ్ కమ్యూనికేషన్ ఇద్దరికీ మేలు చేస్తుంది. పరస్పరం అభివృద్ధిని కోరుకునే వ్యక్తుల మధ్య స్నేహం చిరకాలం నిలబడుతుంది.

– భూక్య వైష్ణవి, బీకామ్ ఫస్టియర్

స్నేహం అమూల్యమైంది



స్నేహం అనేది అమూల్యమైనది. ఈ రోజుల్లో మంచి స్నేహితులు అంత సులభంగా దొరకరు. మంచి స్నేహితులను దూరం చేసుకుంటే మళ్లీ దొరకరు. అంత అపురూపమైనదై ఉండాలి. కొనుక్కున్నా, కోల్పోయినా తిరిగి దొరకనంత గొప్పది స్నేహం.

– బానోతు రాజేశ్వరి, బీకామ్ ఫస్టియర్

అమ్మానాన్నలే అసలైన స్నేహితులు



లైఫ్‌లో ఎవరికైనా సరే ఎదగాలనే కోరిక ఉంటుంది. మనం బాగుపడితే చూసి సంతోషించగలిగే స్నేహితులు అవసరమే. పిల్లలు బాగుపడాలని కోరుకునే వాళ్లలో అమ్మానాన్నలను మించిన వాళ్లు ఇంకెవరూ ఉండరని నా ఉద్దేశ్యం. కాబట్టి తల్లిదండ్రులే నిజమైన స్నేహితులు.

– బిల్ల మౌనిక, బీకామ్ ఫైనలియర్

మంచి స్నేహాలు నిలుస్తాయి



మంచి స్నేహాలు కలకలం నిలిచి ఉంటాయి. స్నేహితులను జాగ్రత్తగా ఎంచుకోవాలి. అన్ని కోణాల్లో ఆలోచించాకే ఆత్మీయులుగా భావించాలి.

– ద్యావనపెల్లి వైష్ణవి, బీఎస్సీ ఫైనలియర్



చెలిమి.. కలిమి

- స్నేహబంధం గొప్పది
- మన మంచిని కోరేవారు స్నేహితులు
- కష్టసుఖాల్లో తోడుగా ఉంటారు..
- ఇంట్లో చెప్పలేని బాధలను వారితో పంచుకుంటాం
- పవిత్రమైన స్నేహంలో ఆనందం
- నేడు ఫ్రెండ్‌షిప్ డే

స్నేహ బంధం.. గొప్ప అనుబంధం. దీనికి వయసుతో సంబంధం లేదు. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు అందరిలో స్నేహ భావం ఉంటుంది. ఒక్కచోట చేరితే సందడి వాతావరణం నెలకొంటుంది. ఇంట్లో చెప్పలేని బాధలను సైతం మిత్రులకు చెప్పుకొని, మనసు తేలిక చేసుకుంటాం. స్నేహితులు మన మంచిని కోరేవారు. తప్పును తప్పని చెప్పి, సూచనలు చేస్తారు. కష్టసుఖాల్లో తోడుగా ఉంటారు. స్నేహానికి కులం, మతం లేదు. మనకు కుటుంబం.. తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు, తల్లిదండ్రులు, తోబుట్టువులను ఇస్తుంది. ఒక్క మిత్రులను ఎంపిక చేసుకునే అవకాశం మాత్రమే మనకు ఉంటుంది. వారు మంచివారా, చెడ్డవారా అనేదానిపై మన ప్రవర్తన, పయనం ఆధారపడి ఉంటాయి. స్నేహం పవిత్రమైనదై ఉండాలి. అటువంటి స్నేహంలో ఆనందం ఉంటుంది. నేడు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

కలిసి చదువు, వ్యాపారం



వేములవాడ: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అదే గ్రామానికి చెందిన వొలిమినేని నిత్యానందరావు చిన్నప్పటి నుంచి కలిసే చదువుకున్నారు. అడ్తీ వ్యాపారం చేశారు. 1995లో ఆది శ్రీనివాస్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆయన జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందినా, ఇప్పుడు విప్ స్థాయికి ఎదిగినా ఇద్దరి మధ్య స్నేహం అలాగే ఉంది. వేములవాడకు మకాం మార్చినా ఒకే వీధిలో ఇళ్లు నిర్మించుకున్నారు. కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కళాశాల మైత్రి.. అసెంబ్లీదాకా



కోరుట్ల: కలిసి చదువుకున్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచి, నవ్వులు చిందిస్తూ కలిసే అసెంబ్లీకి వెళ్తున్నారు. స్నేహబంధానికి చిరునామాగా నిలుస్తున్నారు సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్. వీరిద్దరూ గుంటూరులోని విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. అప్పటి స్నేహం ఆ తర్వాత కూడా కొనసాగింది. తన స్నేహితుడు సంజయ్‌కి ప్రజాసేవపై ఉన్న ఆసక్తిని గమనించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరుట్ల అసెంబ్లీ టికెట్ కేటాయించారు. ఎన్నికల సమయంలో ఆయన గెలుపు కోసం ప్రచారం చేశారు. దీంతో సంజయ్ విజయం సాధించారు. తన చిన్ననాటి స్నేహితుడు కేటీఆర్‌తో కలిసి అసెంబ్లీలో అడుగుపెట్టారు.

45 ఏళ్లుగా కష్టసుఖాల్లో..



కనకయ్యకు సాయపడుతున్న మధుగౌడ్ (కుడివైపు వ్యక్తి)

సిరిసిల్లకల్చరల్: ఈ ఫొటోలో టీషర్ట్‌లో ఉన్న వ్యక్తి జాగీరు మధుగౌడ్. ఆయన పక్కనున్నది బోయిని కనకయ్య. వీరిద్దరిదీ ముస్తాబాద్ మండలంలోని వెంకటాపూర్. పదోతరగతి వరకు కలిసి చదువుకున్నారు. తర్వాత మధు చదువు ఆపేసి, జీవనోపాధి కోసం వెల్డింగ్‌షాపు నిర్వహిస్తున్నాడు. కనకయ్య డిగ్రీ, ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి, కొన్నాళ్లు విద్యావలంటీర్‌గా పని చేశాడు. వేతనం సరిపోక వ్యవసాయం చేస్తున్నాడు. కులాలు వేరు, ఉపాధి మార్గాలు వేరైనప్పటికీ ప్రతిరోజూ కలుసుకుంటారు. సాగు పనుల సమయంలో మధు కనకయ్యకు సాయం చేస్తుంటాడు. మధుకు అవసరాల్లో కనకయ్య సాయపడుతున్నాడు. ఇలా వీరు 45 ఏళ్లుగా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు.

కలెక్టరేట్‌లో చిగురించిన స్నేహం



కుటుంబసభ్యులతో కిషన్, రవికుమార్, రాకేశ్, వసంత్, వినయ్‌సాగర్

కరీంనగర్ అర్బన్: 2012లో కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉద్యోగులు.. జూనియర్ అసిస్టెంట్లుగా ఉన్నప్పుడు ఆ ఐదుగురి మధ్య స్నేహం చిగురించింది. ప్రస్తుతం వీరిలో నేరెళ్ల కిషన్(బావుపేట) కలెక్టరేట్ రెవెన్యూ ప్రధాన విభాగంలో నాయబ్ తహసీల్దార్, కుంబాల రవికుమార్(నిట్టూరు) జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల తహసీల్దార్, భూషణబోయిన రాకేశ్ (కరీంనగర్) మానకొండూరు నాయబ్ తహసీల్దార్ (ఎపిక్), ఎడ్ల వసంత్(కొత్తకొండ) వెల్ది ప్రభుత్వ వైద్యశాలలో సీనియర్ అసిస్టెంట్, వినయ్‌సాగర్(కరీంనగర్) నిజామాబాద్ రూరల్ నాయబ్ తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. ఎక్కడున్నా నెలలో ఒక్కసారైనా కలుసుకొని, యోగక్షేమాలు చర్చించుకుంటారు. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం, ఇతర శుభకార్యాలను కలిసే నిర్వహించుకుంటున్నారు. అనాథలకు పండ్ల పంపిణీ, ఆర్థికసాయం, వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేస్తున్నారు.

మిత్రుడి యాదిలో.. ఓ బడి



దయానంద్ మెమోరియల్ స్కూల్



దయానంద్ (ఫైల్)

సిరిసిల్ల: చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు.. వారిలో ఒకరు సిరిసిల్ల పద్మనగర్‌కు చెందిన గోసికొండ దయానంద్ 2002లో ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని అతని స్నేహితులు తట్టుకోలేక పోయారు. దయానంద్ జ్ఞాపకాలను శాశ్వతం చేయాలన్న తలంపుతో ఓ బడి నిర్మించాలనుకున్నారు. మిత్రుల్లో ఒకరైన గాజుల శ్రీనివాస్ యూఎస్‌ఏలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. దయానంద్‌పై అభిమానంతో సిరిసిల్ల పట్టణ శివారులో 22 గుంటల స్థలం కొనుగోలు చేసి, రూ.30 లక్షలతో దయానంద్ మెమోరియల్ స్కూల్ నిర్మించారు. దశాబ్ద కాలంగా పేద విద్యార్థులకు ఉచితంగా ఆంగ్లమాధ్యమంలో విద్యనందిస్తున్నారు. ప్రస్తుతం స్కూల్లో 65 మంది చదువుకుంటున్నారు. నిర్వహణకు ఏటా రూ.5 లక్షలు ఖర్చవుతోంది. ట్రస్ట్ అధ్యక్షుడిగా గాజుల శ్రీనివాస్ ఉన్నారు. స్నేహితులు బోడ రవీందర్, సిరిసిల్ల తిరుపతి, కట్కం గోపి, పయ్యావుల శ్రీనివాస్, బి.రాము, బొడ్డు శ్రీధర్, లింగమూర్తి, సిరిసిల్ల తిరుమలేశ్, వూరడి రవి, కోడం సుధాకర్ బడి నిర్వహణలో భాగస్వాములవుతున్నారు.

మా ఫ్రెండ్ కలెక్టర్



ఫ్రెండ్స్‌తో కలెక్టర్ అంజనేయులు (వృత్తంలో)

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంటలోని కాకతీయ స్కూల్లో 1998–99 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 95 మంది. వీరిలో ఒకరు ఇప్పుడు కలెక్టర్‌గా ఉన్నారు. ఆయనే అబాది జమ్మికుంటకు చెందిన దొడ్డె ఆంజనేయులు. ఐఏఎస్‌గా ఎంపికై, ప్రస్తుతం జార్ఖండ్ రాష్ట్రంలోని డూమ్ జిల్లాలో కలెక్టర్‌గా ఉన్నారు. చిన్ననాటి మిత్రులందరం 6 నెలలకోసారి కలుసుకుంటామని, తమ కుటుంబాల్లో శుభకార్యాలకు కలెక్టర్ ఆంజనేయులుతోపాటు అందరం హాజరవుతామని ఆయన క్లాస్‌మేట్ కూర్మాచలం సందీప్ తెలిపాడు. తాము ఒకరికొకరం సహాయ సహకారాలు అందించుకుంటామని, ఆంజనేయులు కలెక్టర్ అయినా స్నేహితులతో సరదాగా ఉంటాడని పేర్కొన్నారు.

ఎమోషనల్‌గా ఉంటుంది



ఫ్రెండ్ ఇమ్రాన్‌తో శ్రీకాంత్ (ఎడమ)

కోల్‌సిటీ(రామగుండం): మా ఇంటి దగ్గర ఇమ్రాన్, తహసీన్ అహ్మద్ క్లోజ్‌గా ఉండేవారు. స్కూల్‌కు వెళ్లొచ్చాక నాన్న స్కూటీ నడిపేవాళ్లం. వాళ్లు బాటిళ్లలో పెట్రోల్ తెచ్చేవాళ్లు. ఇప్పుడు సాఫ్ట్‌వేర్, టీచర్ ఉద్యోగాల్లో ఉన్నారు. వేణుగోపాల్, తిరుపతి నా బెస్ట్ ఫ్రెండ్స్. తిరుపతి కెమికల్ కంపెనీలో పని చేస్తున్నాడు. వృత్తి రీత్యా ఎక్కడెక్కడో సెటిల్ అయ్యాం. కలిసినప్పుడు చాలా ఎమోషనల్‌గా ఉంటుంది.

– సీహెచ్.శ్రీకాంత్, కమిషనర్, రామగుండం నగరపాలిక

క్లుప్తంగా

చిరుత దాడిలో రెండు ఆవులు హతం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని గోరింటాలకు చెందిన కొమిరిశెట్టి చంద్రం అనే రైతుకు చెందిన రెండు ఆవులపై చిరుత దాడి చేసి చంపింది. సంఘటన సమాచారాన్ని అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడి చేరుకొని చిరుత అడుగుల ఆనవాళ్లను గుర్తించారు. సమీప గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

చందుర్తిలో మరో ఆవుపై?

చందుర్తి(వేములవాడ): మండలంలోని దేవుని తండాకు చెందిన సరిలాల్ అనే రైతుకు చెందిన ఆవుపై శుక్రవారం రాత్రి చిరుతదాడి చేసింది. రైతు సరిలాల్ శుక్రవారం రాత్రి తమ ఆవును పొలం వద్ద గల పశువుల పాకలో కట్టేశాడు. శనివారం తెల్లవారుజామున వెళ్లి చూడగా ఆవు మృతి చెంది ఉంది. సంఘటన స్థలాన్ని అటవీ శాఖ అధికారులు పరిశీలించారు. జంగిల్ క్యాట్ దాడి చేసిందని తెలిపారు.

'అవ్వా.. తాతలకు ఉత్తరం రాద్దాం'

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆధునిక పోకడలతో మాయమైన ఉత్తరాల గొప్పదనాన్ని తెలిపేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు 'అవ్వా తాతలకు ఉత్తరం రాద్దాం' అనే వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పత్తిపాక ఫౌండేషన్, గరిపెల్లి ట్రస్టు కన్వీనర్ గరిపెల్లి అశోక్ తెలిపారు. ముస్తాబాద్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. బాలసాహితీవేత్త, మానేరు రచయితల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ బాలసాహిత్య రజతోత్సవ వేళ విద్యార్థులకు జిల్లా అంతటా వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడో ఉన్న అమ్మమ్మ, నాన్నమ్మ, తాతలకు మనుమలు స్వయంగా ఉత్తరాలు రాసి ఆత్మీయతను తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు.

అటవీ బేస్ క్యాంప్ సిబ్బందిపై దాడికి యత్నం

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రంలోని రాసిగుట్టపరిధిలోని నీలగిరి ప్లాంటేషన్ అటవీశాఖ బేస్ క్యాంప్ సిబ్బంది శనివారం ప్లాంటేషన్ పరిశీలనకు వెళ్లగా, ఓ గిరిజన రైతు ఆ మొక్కలను ట్రాక్టర్‌తో ధ్వంసం చేశాడు. గమనించిన బేస్ క్యాంప్ సిబ్బంది ఆ రైతును ఈ విషయమై నిలదీశారు. కోపోద్రిక్తుడైన గిరిజన రైతు అధికారులను బూతులు తిడుతూ ట్రాక్టర్‌ను వారిపైకి ఎక్కించేందుకు ప్రయత్నించాడు. అధికారులు అప్రమత్తమై తప్పించుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని సెక్షన్ అధికారి పద్మలతకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

నేడు 'నీ గానమే నా ప్రాణం'

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం 'నీ గానమే నా ప్రాణం' ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. రాచర్లబొప్పాపూర్‌లోని హేమాద్రి ఫంక్షన్‌హాల్ ఈ వేడుక జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అయ్యప్ప భక్తి పాటల కచేరి, సాయంత్రం 7.15 గంటలకు పడిపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

జిల్లాలో చిరు జల్లులు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా శనివారం చిరుజల్లులు కురిశాయి. రుద్రంగిలో 12.2 మిల్లీమీటర్ల వర్షం పడగా.. చందుర్తిలో 4.8, వేములవాడ రూరల్‌లో 3.4, బోయినపల్లిలో 1.8, వేములవాడలో 2.3, సిరిసిల్లలో 1.0, కోనరావుపేటలో 4.7, వీర్నపల్లిలో 3.6, ముస్తాబాద్‌లో 4.0, తంగళ్లపల్లిలో 0.5, ఇల్లంతకుంటలో 0.6 మిల్లీమీటర్ల వర్షాలు పడ్డాయి.

కళల సౌరభం.. సాహిత్య పరిమళం

- సిరిసిల్ల కార్మిక క్షేత్రంలో పురస్కారాలు
- రాష్ట్రస్థాయిలో అవార్డుల ప్రదానం
- నేడు జూకంటికి నాగుల మల్లయ్య పురస్కారం

సిరిసిల్ల: సాహిత్యరంగానికి ఊటబావి మానేరు తీరం. కళలకు, కళాకారులకు నిలయం. వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్లలో రాష్ట్రస్థాయి పురస్కారాలు, అవార్డులు సైతం అందిస్తున్నారు. 37 ఏళ్లుగా సిరిసిల్లలో కళలు, సాహిత్యరంగాల ప్రముఖులకు నాగుల మల్లయ్య స్మారక అవార్డును ప్రదానం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని మాన్య ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రచయిత, కవి, దాశరథి అవార్డు గ్రహీత జూకంటి జగన్నాథంకు ఈ అవార్డును అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారు. సాహిత్య పరిమళాలు, కళాసౌరభాలకు వేదికవుతున్న నాగుల మల్లయ్య స్మారక పురస్కారంపై కథనం.


సినీనటుడు శ్రీహరికి నాగుల మల్లయ్య అవార్డును అందిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు (ఫైల్)

మూడున్నర దశాబ్దాలుగా పురస్కారాలు

సిరిసిల్ల కేంద్రంగా రంగస్థల నటులకు, కళాకారులకు, సాహిత్యకారులను గుర్తిస్తూ అవార్డులు, పురస్కారాలతో సన్మానిస్తుంది. 1987 ఆగస్టు 4న నాగుల మల్లయ్యగౌడ్ స్మారక అవార్డును ఆయన తనయులు స్థాపించారు. మూడున్నర దశాబ్దాలుగా సిరిసిల్ల కేంద్రంగా కళాకారులు, కవులు, సినీ గేయరచయితలు, సామాజిక సేవకారులకు అవార్డు అందిస్తున్నారు. ఒగ్గుకథ కళాకారుడు మిద్దె రాములుకు తొలి పురస్కారాన్ని అందించగా.. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి, సినీనటులు కాంతారావు, శ్రీహరి, రచయిత అందెశ్రీ, రసమయి బా లకిషన్, సుద్దాల అశోక్‌తేజ, దేవదాస్ కనకాల, చందన్ రాజు, గోరటి వెంకన్న, సుద్దాల బాలయ్య, ఎండీ సలీం, పత్తిపాక మోహన్, రుద్ర రవి, జడల రమేశ్, డాక్టర్ పూర్ణచందర్, పెద్దింటి అశోక్‌కుమార్, మడుపు ముత్యంరెడ్డి, ఉత్తేజ్, యెల్దండి వేణు, వంతడ్పుల రమాదేవి, ఆకునూరి దేవయ్య, ప్రణయ్‌కుమార్, మధుప్రియ, సురభి కళాకారులు, సంతోష్, ఆకునూరి నర్సయ్య, సీహెచ్ రాజలింగం, దూడం నాంపల్లి, జక్కని వెంకట్రాజం, అష్టావధానం తిగుళ్ల శ్రీహరిశర్మ, సారంగపాణి, వరంగల్ శంకర్, మురారి, డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, నాట్యాచార్యుడు కళాకృష్ణ, హరికథ కళాకారిణి ఉమామహేశ్వరిలకు నాగుల మల్లయ్య అవార్డు అందజేశారు.

నేడు జూకంటికి అవార్డు



సిరిసిల్లకు చెందిన జూకంటి జగన్నాథం మట్టికవి. మనుషుల మీద మట్టిమీద మమకారం ఉన్న కవి. ఇంతవరకు పదకొండు కవితా సంకలనాలు, ఒక కథాసంకలనంతోపాటు సమగ్ర సాహిత్యాన్ని మూడు సంపుటాలుగా తెచ్చారు. 80వ దశకంలోనే ప్రజల పక్షం వహించి పాలకుల మీద నిరసనతో వాస్తవాలు ప్రజలకు చెప్పడానికి కవిత్వాన్ని తన యానకంగా చేసుకున్నారు. రాబోయే ప్రమాదాలను పసిగడుతూ ప్రజలను హెచ్చరిస్తున్నారు. రాజ్యహింసను, పోలీసుల నిర్బంధాన్ని స్వయంగా ఎదుర్కొని నిలిచిన తన మంకుపట్టు వీడలేదు. ప్రపంచబ్యాంకు అప్పులిచ్చి పాలకులను బానిసలను చేసుకొని ప్రపంచాన్నే గ్లోబల్ విలేజ్ చేయాలనుకొని వ్యా పార ద్వారాలను తెరవకముందే తెలుగునాట ఇండియా ప్రైవేటు లిమిటెడ్, వాస్కోడిగామ డాట్‌కామ్ కవితలు రాసి ఆ తలపుల చప్పుడును, వాటి వెనుక దాగిన కుట్రదారుల తలంపులపై కవిత్వాన్ని వినిపించారు. అలాంటి సాహితీవేత్తకు నేడు నాగుల మల్లయ్యగౌడ్ స్మారక అవార్డును అందిస్తున్నారు.

ఏటా అవార్డు అందిస్తున్నాం



మా తాతయ్య నాగుల మల్లయ్య స్వయంగా రంగస్థల నటుడు. ఆయన జ్ఞాపకార్థం అవార్డును 1987లో మా నాన్న సత్యనారాయణగౌడ్ ప్రారంభించారు. అప్పటి నుంచి ఏటా మేం ఆయనను గుర్తు చేసుకుంటూ కళాకారులకు, సాహిత్యకారులకు ఈ అవార్డు అందిస్తున్నాం. ఈ ఏడాది ప్రముఖ కవి, రచయిత, రాష్ట్ర స్థాయిలో దాశరథి సాహిత్య అవార్డు గ్రహీత జూకంటి జగన్నాథంకు అందించడం సంతోషంగా ఉంది.

– నాగుల సంతోష్‌గౌడ్, అవార్డు కమిటీ కో కన్వీనర్

రేపటి నుంచి బ్రేక్ దర్శనాలు షురూ

- రాజన్న ఆలయ చరిత్రలో తొలిసారి
- శ్రావణమాసానికి భారీ ఏర్పాట్లు


వేములవాడ రాజన్న ఆలయం

వేములవాడ: రాజన్న సన్నిధిలో మొట్టమొదటిసారి బ్రేక్ దర్శనాలను ఈనెల 5 నుంచి ప్రారంభిస్తున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా బ్రేక్ దర్శనాలను ఆరంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆలయంలోని ప్రస్తుత శీఘ్రదర్శనం క్యూలైన్‌ను బ్రేక్ దర్శనాలకు ఉపయోగించుకుని, శీఘ్రదర్శనం భక్తులను ఆలయ తూర్పు ద్వారం నుంచి నేరుగా పంపించేందుకు క్యూలైన్లు సిద్ధం చేసినట్లు ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ తెలిపారు.

రెండుసార్లు బ్రేక్ దర్శనాలు

ఈనెల 5 నుంచి ప్రారంభించే బ్రేక్ దర్శనాలను నిత్యం రెండు సార్లు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనాలు కొనసాగనున్నాయి. ఇందుకు రూ.300 టికెట్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీ టికెట్‌కు ఒక లడ్డూ ప్రసాదం ఉచితంగా అందించనున్నారు.

శ్రావణమాసం ఉత్సవాలకు ఏర్పాట్లు

రాజన్న సన్నిధిలో ఈనెల 5 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు శ్రావణమాసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజులపాటు భక్తుల రాకతో రాజన్న క్షేత్రం సందడిగా మారనుంది. ప్రతీ సోమవారం ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి మహాలింగార్చన నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. ప్రతీ శుక్రవారం ఆలయ అనుబంధ మహాలక్ష్మి ఆలయంలో చతుష్షష్టి పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో ఐదు సోమవారాలు, నాలుగు శుక్రవారాలు వస్తున్నాయని అర్చకులు చంద్రగిరి శరత్ శర్మ తెలిపారు.

బడ్జెట్‌లో రాజన్నకు రూ.50కోట్లు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: బడ్జెట్‌లో వేములవాడ రాజన్నకు రూ.50కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఏటా బడ్జెట్‌లో రూ.100కోట్లు కేటాయిస్తామని ప్రకటించి శఠగోపం పెట్టారని, తాము హామీ ఇవ్వకున్నా రూ.50కోట్లు ఇచ్చామన్నారు. బ్రిడ్జి నుంచి గుడి వరకు రోడ్ల విస్తరణ, ఇతర అవసరాలకు ఈ నిధులు వినియోగిస్తామన్నారు. పదేళ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రసాద్ స్కీంలో రాజన్న ఆలయాన్ని ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో వేములవాడకు వచ్చిన మోదీ రాజన్న పేరు ఎత్తలేదని గుర్తుచేశారు. వీటీడీఏ నుంచి వెనక్కివెళ్లిన రూ.20కోట్లను తిరిగి తీసుకొచ్చానన్నారు. రూ.320 కోట్లతో ఎల్లంపల్లి 1, 2 కెనాల్ నెట్‌వర్క్ తాగునీటి పథకాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

నాలుగు దశల్లో ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలన

- 2025 మార్చి నాటికి పూర్తి
- డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కలెక్టర్లతో సమీక్ష


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను నాలుగు దశల్లో పరిశీలించి 2025 మార్చి నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి భట్టి విక్రమార్క, భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో ఎల్‌ఆర్‌ఎస్‌లో 25.70 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి నష్టం జరగకుండా, చెరువులు, కాలువలు, ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురికాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి సకాలంలో పూర్తిచేయాలని సూచించారు.

60వేల దరఖాస్తులు క్రమబద్ధీకరణ

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్‌లో 2020 నాటికి 25,70,708 దరఖాస్తులు రాగా.. ఇప్పటి వరకు 4,28,832 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, 60,213 వాటిని క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, డీపీవో వీరబుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్లు అన్వేశ్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు – సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

జిల్లాలో పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలపై ఆరా తీశారు. నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును ఆన్‌లైన్‌లో పెట్టిందని, ప్రజలు తమ సలహాలు, సందేహాలను ఈనెల 23 వరకు తెలియజేయాలని కోరారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ధరణి ద్వారా 3,240 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటివరకు 737 దరఖాస్తులను ఆమోదించామని, 2501 దరఖాస్తులను తిరస్కరించామని, 969 దరఖాస్తుల పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని సకాలంలో పరిష్కరిస్తామని, తిరస్కరించే దరఖాస్తులపై తప్పనిసరిగా కారణం తెలియజేస్తామని కలెక్టర్ వివరించారు.

నీట్‌లో ప్రణీతకు రాష్ట్రస్థాయి ర్యాంక్

నీట్‌లో ప్రణీతకు రాష్ట్రస్థాయి ర్యాంక్


తల్లిదండ్రులతో కోడం ప్రణీత

సిరిసిల్లకల్చరల్: వైద్య విద్యాభ్యాసానికి ఉద్దేశించిన నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్)లో పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన కోడం ప్రణీత రాష్ట్రస్థాయిలో 136వ ర్యాంకు సాధించింది. జాతీయస్థాయిలో జరిగిన నీట్ పరీక్షలో 720 మార్కులకు 678 మార్కులతో 8,100వ ర్యాంకు సాధించింది. ప్రణీత తల్లిదండ్రులు శ్రీనివాస్, మంజుల. పదోతరగతి వరకు పత్తిపాక వీధిలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో చదివిన ప్రణీత ఇంటర్మీడియెట్ హైదరాబాద్ శ్రీచైతన్యలో పూర్తి చేసింది. ప్రణీత సోదరి కూడా నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతుంది.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయండి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు, గ్రామస్తులు కలిసి విజయవంతం చేయాలని సిరిసిల్ల ఆర్డీవో, తంగళ్లపల్లి స్పెషల్ అధికారి ఎల్.రమేశ్ కోరారు. మండల పరిషత్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పచ్చదనం పెంచాలని సూచించారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జాబేగ్, ఎంఈవో దూస రఘుపతి, ఐకేపీ ఏపీఎం బత్తిని పర్శరాములు పాల్గొన్నారు.

5న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్లలోని మినీస్టేడియంలో అండర్ 12, 18, 23 విభాగాల్లో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈనెల 5న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను మెదక్‌లో ఈనెల 10న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, 10వ తరగతి మెమో ఒరిజినల్‌పాటు జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు 79014 64456, 93928 80231లో సంప్రదించాలని కోరారు.

సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం తేవాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సాంబశివరావు

వేములవాడ: రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులకు గ్రామీణ కూలీలకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేములవాడలో వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. పాలకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేల భృతి చెల్లించాలని, ఆసరా పెన్షన్ మాదిరిగానే 50ఏళ్లు నిండిన వ్యవసాయ కూలీలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, గ్రామీణ ఉపాధిహామీ కూలీలకు 200 రోజుల పనికల్పించి, దినసరి వేతనం రూ.700 చెల్లించాలని కోరారు. గ్రామీణ నిరుపేదలకు వెంటనే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాంతయ్య, నక్క బాలమల్లేశ్, రాష్ట్ర నాయకులు కొయ్యడ సృజన్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, జంగయ్య, యేసు, లింగారెడ్డి ఎగుర్ల మల్లేశం, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సభ్యులు కడారి రాములు పాల్గొన్నారు.

రాముడి పేరుతో రాజకీయం చేస్తుండ్రు

దేశాభివృద్ధి, కార్మికుల సంక్షేమాన్ని మరచిన కేంద్ర ప్రభుత్వం రాముడి పేరుతో రాజకీయం చేస్తుందని, రాముడు అందరివాడు కదా.. అంటూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందని, రైతులకు రుణమాఫీ చేసి దేశంలోనే అగ్రగామి ప్రభుత్వంగా నిలిచిందన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత


పుస్తకాలు అందిస్తున్న బీఎన్ రావు

సిరిసిల్ల కల్చరల్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల సౌకర్యార్థం బీఎన్ రావు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎన్ రావు పలు పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా ఆసిఫాబాద్, కరీంనగర్‌తో పాటు పలు జిల్లాల్లో అందించిన సేవలను వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు పత్తిపాక పద్మ, గుండ్లపెల్లి నీరజ, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, గ్రంథ పాలకులు, ట్రస్టు నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కుంకుమార్చన



సిరిసిల్లకల్చరల్: అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కుంకుమార్చన రెండో రోజు శనివారం నేత్రపర్వంగా సాగింది.

ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి



సిరిసిల్ల: ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి, వాస్తవాల ఆధారంగా, నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎల్.రమేశ్, రాజేశ్వర్, అన్ని మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్నలను ఆదుకోండి



సిరిసిల్లటౌన్: నేతన్నలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన దీక్షలు శనివారం 14వ రోజుకు చేరాయి. ఈసందర్భంగా పలువురు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎమ్మెల్యే కేటీఆర్ పద్మశాలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వస్త్రపరిశ్రమ సమస్యలు పరిష్కరించడంలో బాధ్యతలు విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షల్లో వీరబత్తిని మల్లేశం, వెల్ది నాగరాజు, అంబటి రవీందర్, సకినాల మహేశ్, బింగి రమేశ్, జిందం దేవదాసు, గుండేటి ఆనందం, సూరంపల్లి రాజు, మార్గం నరేశ్ తదితరులు కూర్చున్నారు. జేఏసి నేతలు పంతం రవి, మూశం రమేశ్, ఆడెపు భాస్కర్, వెల్దండి దేవదాసు సంఘీభావం తెలిపారు.

డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళలకు బహుమతులు



వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్‌కు నడిచే డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళల కోసం ఏర్పాటు చేసిన లక్కీడ్రాను శనివారం నిర్వహించారు. మొదటి బహుమతి రేగూరి సుజాత, రెండో బహుమతి అఖిల, మూడో బహుమతి రమ్యకు వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ బహుమతులను విశాల షాపింగ్‌మాల్ సౌజన్యంతో అందించినట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, పీఆర్వో శ్రీనివాస్ ఉన్నారు.